క్లుప్తంగా

నేడు 'భూభారతి'పై అవగాహన

బోథ్: ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూభారతి చట్టంపై అధికారులు మంగళవారం రైతులకు అవగాహన కల్పించనున్నారు. మండలంలోని ధన్నూర్ (బి) గ్రామంలోని రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్, సొనాల మండల కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో అవగాహన కల్పించనున్నట్లు బోథ్, సొనాల తహసీల్దార్ సుభాష్ చందర్, మల్లేష్ తెలిపారు.

108 సిబ్బందికి కూలర్ అందజేత

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆరోగ్య ఉప కేంద్రంలో ఉండే 108 సిబ్బందికి మాజీ ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి సోమవారం కూలర్ అందచేశారు. ఎండలు మండి పోవడంతో 24 గంటల పాటు ప్రజలకు సేవలు అందంచే 108 సిబ్బందికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంత డబ్బుతో కూలర్ కొనుగోలు చేసి అందచేశాడు. దీంతో 108 సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ప్రాథమిక సహకార సంఘం సీఈవో ఈశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ హరికృష్ణ తెలిపారు. సమావేశానికి సీజీఆర్ఎఫ్ నిజామాబాద్ చైర్మన్ ఎరుకల నారాయణతో పాటు సభ్యులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనన్నట్లు పేర్కొన్నారు. తాంసి, భీంపూర్, తలమడుగు సెక్షన్ల పరిధిలోని రైతులు, వినియోగదారులు ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శివపురాణం విని తరించాలి

ఇచ్చోడ: శివపురాణం వినడం ద్వారా భక్తులు తరించిపోతారని భీమా శంకర్ మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం భీమా శంకర్ మహారాజ్ ఆధ్వర్యంలో శివపురణం ప్రారంభించారు. శివుడి అజ్ఞాన లేనిదే చీమైన కుట్టదన్నట్లు సకల జీవ రాశులన్నింటికీ శివుడు ప్రతీ రోజు తన దివ్య దృష్టితో కాపాడుతునే ఉంటడానికి అన్నారు. తోటి మనిషికి సాయం చేయాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో యువత ముందుండాలి

ఇచ్చోడ: దేశ రక్షణ కోసం యువత ముందుకు రావడం అభినందనీయమని ముఖరా (బి) మాజీ సర్పంచ్ అడప్ మారుతి అన్నారు. ముఖరా (బి) గ్రామానికి చెందిన యువకుడు పాన్‌పట్టి సాయితేజ ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం సాధించడంతో సోమవారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కష్టపడి చదువుకొని ఆర్మీలో ఉద్యోగం సాధించిన సాయితేజను గ్రామ యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు దేవ్‌రావ్, రామారావు, కిషన్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రదర్శన

ఆదిలాబాద్‌టౌన్: పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, తల్లిదండ్రులకు వాటి ద్వారా కలిగే ప్రయోజనాల గురించి అంగన్‌వాడీ కార్యకర్త అన్ములవార్ కవిత తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రొటీన్లు, విటమిన్‌లతో కూడిన ఆహారం తీసుకోవడంతో పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసులు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రియ, మనిషా, డాలీ, సునీత, శ్రేష్ఠ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్లు పరిశీలన

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపికైన లబ్ధిదారుల ఇళ్లను సోమవారం ఎంపీడీవో పరిశీలించారు. మండలంలోని అడేగామ(కే)లో ఆయన పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని ఎంపికైన వారి ఇళ్లను చివరి సారిగా పరిశీలించి తుది జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

సారొస్తేనే.. వస్తారా?

- ప్రజావాణిపై జిల్లా అధికారుల నిర్లిప్తత
- వారి గైర్హాజరుపై అడిషనల్ కలెక్టర్ ఆగ్రహం



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు విధిగా హాజరుకావాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవనే కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలను పలు శాఖల ఉన్నాతాధికారులు పట్టించుకోవడం లేదు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ప్రజావాణిని పట్టించుకోవడం లేదు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. వారికి బదులుగా తమ కిందిస్థాయి ఉద్యోగులను పంపించారు. మరికొంత మంది ఉదయం 11.30గంటల తర్వాత హాజరయ్యారు. అయితే ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి గైర్హాజరైన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులతో పాటు వారికి బదులుగా వచ్చిన ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈవారం వివిధ సమస్యలతో కూడిన 90 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదన వారి మాటల్లోనే...

కౌలుకిచ్చిన భూమిని విక్రయించారు



అయ్యా నేను భర్తను కొల్పోయిన నిరుపేదరాలను. నాకు సోనాల మండల శివారులోని సర్వే నెంబర్ 141/ఆలో 4.28 గుంటల భూమి ఉంది. దాన్ని తమ అత్తమామలు ఓ మహిళకు కౌలు కోసం ఇచ్చారు. అయితే సదరు మహిళ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయిస్తూ.. రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. దీనిపై మండల తహసీల్దార్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి వివరాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తమరు దీనిపై విచారణ జరిపించి నా భూమిని నాకు దక్కేలా చర్యలు తీసుకొని న్యాయం చేయాలి.

– బర్కుంటి లక్ష్మి, బుద్దికొండ, నేరడిగొండ

పంచాయతీ సెక్రెటరీ పట్టించుకోవడం లేదు



తమంతా నిరుపేదలం. ఉపాధి పనుల కోసం జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే నెలలు గడుస్తున్నా.. వాటిని ఇవ్వడం లేదు. తమలో కొంత మందికి సొంత ఇండ్లు కూడా లేవు. పూరిగుడిసెలు, పెంకుటిళ్లలో నివసిస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇండ్లను కూడా మంజూరు చేయడంలేదు. బోర్‌వెల్, విద్యుత్ మోటర్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎలాంటి స్పందన లేదు. ఈ సమస్యలపై పంచాయతీ సెక్రెటరీని పలుమార్లు కలిసి విన్నవించినా.. పట్టించుకోవడం లేదు.

– బాధిత మహిళలు, వర్ధమన్నూర్, బజార్‌హత్నూర్

బోరు మంజూరు చేయాలి



అయ్యా మేమంతా దళితబస్తీ లబ్ధిదారులం. గత ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను సాగు చేసుకుని జీవిస్తున్నాం. భూములు పంపిణీ చేసిన సమయంలోనే తమకు బోర్‌వెల్స్, విద్యుత్ మోటర్లు, కరెంట్ సౌకర్యం కల్పిస్తామని అధికారులు హామీనిచ్చారు. అయితే ఏళ్లు గడుస్తున్నప్పటికీ బోర్‌వెల్స్‌ను మంజూరు చేయకపోగా విద్యుత్ సౌకర్యం, మోటర్లను సైతం ఇవ్వలేదు.

– దళితబస్తీ లబ్ధిదారులు, కరంజి, జైనథ్

ఇళ్లు మంజూరైనట్లుగా చూపిస్తుంది



అమ్మా నేను కూలీ, నాలీ చేసుకుని జీవించే నిరుపేదను. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. ప్రభుత్వం ప్రకటించిన అర్హుల జాబితాలో నా పేరు వచ్చింది. ఇంటిని నిర్మించుకుంటామని అధికారులను అడిగితే నీ పేరిట గతంలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందని, బిల్లులు కూడా లేపుకున్నారని చెబుతున్నారు. కానీ నాకు ఉండటానికి ఎలాంటి ఇల్లు లేదు.

– దువ్వాస గంగన్న, తలమడుగు

రామ మందిరానికి అనుమతించాలి



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో పురాతనమైన శ్రీరామాలయం ఉంది. దీన్ని పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు దర్శించుకుని పూజలు చేస్తుంటారు. అయితే సిమెంట్ ఫ్యాక్టరీని తుక్కు కింద విక్రయించాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం ఆ ఆలయానికి వెళ్లే ద్వారాన్ని మూసివేసింది. దీంతో ఆలయానికి వస్తున్న భక్తులు గేట్ తాళం వేసి ఉండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. భక్తుల నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకొని గేట్‌ను తెరిపించాలి.

– కస్తాల అరుణ్ కుమార్, ఆదిలాబాద్

గ్రామాల్లో ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

- జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి

తాంసి: గ్రామాల్లో ప్రజావాణి దరఖాస్తులను తీసుకునేలా చర్యలు చేపడుతున్నట్లు జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి బహిరంగ విచారణ వేదిక నిర్వహించారు. జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి కిషన్ హాజరై పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 104 దరఖాస్తులు రాగా 54 మంది సమస్యలను పరిష్కారించారు. మార్కగూడ గ్రామానికి చెందిన లక్ష్మిబాయికి 8 సంవత్సరాల తర్వాత పింఛన్ పునరుద్ధరించారు. కరంజి, అంతర్గాం గ్రామానికి చెందిన రైతులు త్రీఫేజ్ విద్యుత్ సమయపాలన లేకుండా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇచ్చే సమయంలో సమాచారం తెలియజేస్తామని విద్యుత్ అధికారులు రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణా రెడ్డి, తహసీల్దార్ నలంద ప్రియ, ఏవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమానిత ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు

సిరికొండ: అనుమానిత ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. సోమవారం మండలంలోని ఫకీర్‌నాయక్ తండాలో పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీసులు అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి ఆపద వచ్చిన పోలీసులను సంప్రదించాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దన్నారు. అలాగే మత్తు పదార్థాల కు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు చేసినా.. సేవించినా.. చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై శివరం, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

నేరడిగొండ: రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అత్యవసరమైన పనులు ఉంటే తప్పా బయటకు వెళ్లవద్దని సూచించారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా వైద్యులు సూచించిన జాగ్రత్తలను పాటించాలన్నారు. ఎండలో బయటకు వెళ్లినప్పుడు రుమాలు ధరించి పనులు చేసుకోవాలని పేర్కొన్నారు.

కజ్జర్లలో బడిబాట

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో లేని సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలలో కల్పించడం జరిగిందన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి ఈ ఏడాది 9 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యా హ్న భోజనం, ప్రతిభవంతులైన ఉపాధ్యాయులు, పాఠశాలలో బోధన చేయడం జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మండలంలోని కోకస్‌మన్నూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది చంద్రశేఖర్, దేవురావుల ఆధ్వర్యంలో టీకాలు వేశారు. పశుపోషకులు ప్రతిఒక్కరూ తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని లింగట్ల గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

రక్తదానం

బోథ్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రిలో మహిళకు గర్భసంచి శస్త్రచికిత్స చేయాల్సిన పరిస్థితి ఉండటంతో అత్యవసరంగా రక్తం అవరమయింది. విషయం తెలుసుకున్న బోథ్‌కు చెందిన బోయిడి ఆకాశ్ నిర్మల్ వెళ్లి రక్తదానం చేశాడు. మహిళ కుటుంబీకులు, గ్రామస్తులు ఆకాశ్‌ను అభినందించారు.

యువతి వివాహానికి చేయూత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చించుఘాట్ గ్రామంలో పెళ్లి చేయడానికి నిశ్చయించిన నిరుపేద వధువు వివాహానికి కుమ్ర శోభరాణి కుమ్ర రాజులు రూ. 55 వేలు యువతి తండ్రి ఆర్క శ్యామ్‌రావ్‌కు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పెళ్లిళ్ల బట్టలు, ఇతర వస్తువులను కానుకలను ఇవ్వడాన్ని తగ్గించాలని, పేద కుటుంబాలకు ప్రతిఒక్కరూ అండగా నిలువాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కులస్తులు సిడాం సీతబాయి, ఇసురు, ఆనంద్‌రావ్, ఆత్రం చంద్రకళ, ఆత్రం వెంకటి పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన ఆబిద్ పెద్ద కుమారుడు ఉబేద్ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ తాజొద్దిన్, నాగాపూర్ మాజీ సర్పంచ్ సునీల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడకు చెందిన మతిస్థిమితం లేని కస్తూరి భూదవ్వ (80) రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మృతురాలు భూదవ్వ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహార మందు తాగింది. దీంతో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుమారుడు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుమారుడు పెద్ద భూమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

జొన్న పంట దగ్ధం

ఉట్నూర్‌రూరల్: షార్ట్‌సర్క్యూట్ కారణంగా మండలంలోని సాలెవాడ గ్రామానికి చెందిన రైతు రబడె రాము వ్యవసాయ క్షేత్రంలోని రెండు ఎకరాల జొన్న పంట దగ్ధం అయింది. పంట దగ్ధం కావడంతో సుమారు రూ. 2 లక్షలపైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి తనకు పరిహారం అందించాలని కోరాడు.

బుద్ధ జయంతి ఘనంగా నిర్వహించాలి

ఆదిలాబాద్‌రూరల్: మే 12న బౌద్ధుల సర్వ శ్రేష్ఠ బుద్ధ జయంతిని ఘనంగా నిర్వహించాలని భారతీయ బౌద్ధమహ సభ జిల్లా శాఖ నిర్ణయించడం జరిగిందని భారతీయ బౌద్ధమహ సభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న జాడే ప్రజ్ఞా కుమార్, జిల్లా అధ్యక్షుడు విఠల్‌లు అన్నారు. సోమవారం మావల మండలంలోని కేఆర్కే కాలనీలో సమావేశం నిర్వహించారు. ముందుగా బుద్ధుడు, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, రమాబాయి అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మండలాలలో భారతీయ బోధన సభ మహిళా, బాల, యువ, శ్రామనేర్ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం సెలవుగా ప్రకటించాలని, బుద్ధ జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, కాంతారావు, గుల్షన్, మహిళా జిల్లా అధ్యక్షురాలు ఉజ్వల, నాగ్సేన్ బాబు, లక్ష్మణ్, సిద్ధార్థ ఝాడే, సంతోష్ పాల్గొన్నారు.

నాడు శిథిలం.. నేడు సుందరం





బోథ్ మండలంలోని నక్కలవాడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గతంలో శిథిలావస్థకు చేరుకుని కళావిహీనంగా ఉండేది. ఇటీవల భవనానికి మరమ్మతులు చేసి, రంగులు వేయడంతో సుందరంగా మారింది. ఇటీవల పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు రావుల మహేందర్, స్వామిలు ప్రత్యేక చొరవ చూపి పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు. – బోథ్

డీజేలకు అనుమతి లేదు

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల అనుమతి లేకుండా డీజేలు నిర్వహించవద్దని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి 10 గంటల తర్వాత డీజే, మ్యూజిక్ శబ్దాలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన డీజే నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో పాటు డీజేలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆదిలాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా డీజేలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం రెండు బాక్సులకు మించి శబ్దాలు వచ్చే వాటికి అనుమతి లేదన్నారు. శబ్ద కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుండె సమస్యలతో బాధపడుతున్న వారు, చిన్న పిల్లలు డీజేలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

'ల్యాండ్ మాఫియాను పెంచిపోషిస్తున్న ఎమ్మెల్యే'

కైలాస్‌నగర్: ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదిలాబాద్‌లో భూకబ్జాలకు పాల్పడుతూ ల్యాండ్ మాఫియాను పెంచి పోషిస్తున్నారని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ అసైన్డ్ భూములను కబ్జా చేస్తూ పేదల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. తన అక్రమాలకు అడ్డు వచ్చేవారిపై, అన్యాయాన్ని ప్రశ్నించే వారిపై భౌతిక దాడులు కూడా చేయించారని ఆరోపించారు. తన అవినీతి అక్రమాల బాగోతం బయట పడుతుందనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులతో అంటకాగుతున్నారని విమర్శించారు. తనను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే అనుకుని వ్యవహరించండని నిస్సిగ్గుగా వారితో మాట్లాడారని ఒకరిద్దరు మంత్రులే చెప్పారని వెల్లడించారు. సమావేశంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి అంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

సామూహిక లింగాష్టక పారాయణం



లింగాష్టక పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర మందిరంలో సోమవారం ఎనిమిదవ సామూహిక లింగాష్టక పారాయణం నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు సామూహిక లింగాష్టక పారాయణం ప్రారంభించారు. ప్రతీ సోమవారం ఆలయంలో లింగాష్టక పారాయణం నిర్వహిస్తామని శివాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మొత్తం 21 వారాలపాటు సామూహిక లింగాష్టక పారాయణం కొనసాగుతుందన్నారు. కాంబ్లే బాబు దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఇంద్రవెల్లి: గర్భిణులు ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐడీఎస్ సూపర్‌వైజర్ వందన అన్నారు. సోమవారం మండలంలోని దనోరా(బి) పరిధిలోని జనతగూడ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్ పక్షం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులతో పాటు బాలింతలు, పిల్లల సంరక్షణ, ఎన్ఆర్‌సీ రేఫరల్‌పై తల్లులకు అవగాహన కల్పించారు. ప్రతీ రోజు అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కమలబాయి, అభియాన్ కోఆర్డినేటర్ పురుషోత్తం, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వనజాతి విత్తనాలతో ఉపయోగం



వనజాతి విత్తనాలను ప్రదర్శిస్తున్న ప్రొఫెసర్లు

ఇచ్చోడ: వనజాతి మొక్కల విత్తనాలతో అనేక ఉపయోగాలు ఉంటాయని వృక్షశాస్త్ర సహ ఆచార్యులు డాక్టర్ వి మధు, ఆర్థిక శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సర్వస్వతిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విత్తన ప్రదర్శనలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ కర్డల్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రదర్శనలో ఇచ్చోడ డిగ్రీ కళాశాల విద్యార్థులు తానికాయ, నల్లమద్ది, తెల్లమద్ది, పుణికి, మారేడు, వెలగ, రేగ, 50 రకాల వన్యజాతి మొక్కల ఫలాలు, వాటి విత్తనాలను సేకరించి వాటిని వన్యజాతి జీవవైవిధ్యంగా అంశంపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన తెలంగాణ ఉన్నత విద్య చైర్మన్ బాలకిష్టరెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు సరస్వతి, అనిత, మురళి, నర్సయ్య, విజయకుమార్ పాల్గొన్నారు.

గ్రామాల వారీగా జొన్న కొనుగోళ్లు

తలమడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లో తేదీల వారీగా జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న కొనుగోళ్లు చేయడం జరుగుతుందని ఏవో ప్రమోద్ రెడ్డి, సహకార సంఘ సీఈవో శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 22 నుంచి మే నెల 24 వరకు జొన్న కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాలు వారీగా కేటాయించిన తేదీలలో పంటను తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 22న కజ్జర్ల, 23న సుంకిడి, 24న రుయ్యాడి, 25న బరంపూర్, 28న పల్సి(బి), 29న పంగిడిపిప్పిరి, 30న తలమడుగు, మే 2న కుచులపూర్, 5న దేవాపూర్, 6న ఖోడథ్, 7న ఉండం, 8న అర్లీ, 9న మదనపూర్, 13న లింగి, 14న లక్ష్మింపూర్, 15న నందిగాం, 16న డోర్లి, 17న పల్సి, 19న సకినాపూర్, 20న పల్సి(కే), 21న కప్పర్‌దేవి, 22న దేహగామ, 23న కోసాయి, 24న ఉమ్రి, గ్రామాలు వారీగా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.